

పంచాయతీల్లో ప్రత్యేక పాలనే!

- పెద్ద పంచాయతీలకు తహసీల్దార్లు, ఎంపీడీవోలు
- చిన్న పంచాయతీలకు సూపరింటెండెంట్లు, టైపిస్టులు
- అన్ని శాఖల అధికారుల వివరాల సేకరణ
- సిద్ధమైన ప్రత్యేక అధికారుల జాబితా
- అనుకూలమైన వారి కోసం నేతల పైరవీలు
- రిజర్వేషన్లు మారుతాయేమోనని ఆశావహుల ఆందోళన

నల్లగొండ, జనవరి 25 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): పంచాయతీల పాలకవర్గాల గడువు మరో ఐదు రోజుల్లో ముగియనుంది. పార్లమెంటు ఎన్నికల తరువాతే పంచాయతీ ఎన్నికలు అనే సంకేతాలు నేతలు, అధికారులు ఇప్పటికే ఇచ్చారు. దీంతో పంచాయతీల్లో పాలన సాగేందుకు నేతల స్థానంలో అధికారులు బాధ్యతలు చేపట్టనున్నారు. అందుకు అధికారుల జాబితాలను జిల్లా పంచాయతీ అధికారులు సిద్ధం చేశారు.

ఉమ్మడి జిల్లాలో 1,740 పంచాయతీలు ఉండగా, పెద్ద సంఖ్యలో ప్రత్యేక అధికారుల అవసరం ఉంది. ఈ నేపథ్యంలో ఆ శాఖ ఈ శాఖ అనే తేడా లేకుండా అన్ని ప్రభుత్వశాఖల నుంచి అధికారులు ఇప్పటికే వివరాలు సేకరించారు. తహసీల్దార్ మొదలు టైపిస్ట్ వరకు పంచాయతీలకు ప్రత్యేక అధికారులుగా బాధ్యతలు చేపట్టనున్నారు. ఈమేరకు మూడు జిల్లాల్లో పంచాయతీ అధికారులు ఆయా గ్రామాల అధికారుల జాబితాలను సిద్ధం చేసి పెట్టారు. పంచాయతీల పదవీకాలం వ ుగి సినా, వాటిని తమ చెప్పుచేతల్లో పెట్టుకునేందుకు అధికార పార్టీ నేతలు ప్రయత్నాలు చేశారు. వారికి అనుకూలమైన వ్యక్తులను తమకు కావాల్సిన గ్రామాలకు ప్రత్యేక అధికారులుగా వచ్చేలా జాబితాలు సిద్ధం చేయించినట్టు ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి.

రిజర్వేషన్లపై నేతల్లో ఆందోళన

గ్రామ పంచాయతీల్లో రెండు పర్యాయాలు ఒకే రిజర్వేషన్లు ఉండేలా గత ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీంతో 2019లో జరిగిన ఎన్నికల ప్రకారం అప్పటి రిజర్వేషన్ ఈ ఏడాది జరిగే పంచాయతీ ఎన్నికల్లో కూడా కొనసాగించాల్సి ఉంటుంది. అయితే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో గత రిజర్వేషన్లను కొనసాగించే అవకాశాలు దాదాపు ఉండవని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. అప్పటి రిజర్వేషన్లు ఉంటే స్థానిక సంస్థల ఎన్నికలపై బీఆర్ఎస్ ప్రభావం పడే అవకాశం ఉండటంతో ఆ పార్టీ అవకాశాలను గండి కొట్టాలని కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా అసెంబ్లీలో రిజర్వేషన్లపై చట్టం తీసుకురానున్నట్టు తెలుస్తోంది. పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేయాలని ఉవ్విళ్లూరుతున్న చోటామోటా నాయకులు రిజర్వేషన్లు ఎలా ఉంటాయోనని ఆందోళనలో పడ్డారు. ఇప్పటి నుంచే గ్రామాల్లో తమ బలాన్ని చాటుకునే ప్రయత్నాలు చేస్తున్నా, రిజర్వేషన్లు తారుమారయ్యే అవకాశాలు ఉన్నాయని తెలుస్తుండటంతో ఇప్పటి నుంచే ఖర్చు పెట్టేందుకు వారు వెనుకడుగు వేస్తున్నారు. కొద్ది రోజుల క్రితం రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీల్లో మూడు పర్యాయాలు జరిగిన ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు ఎలా ఉన్నాయనే దానిపై పంచాయతీ అధికారుల నుంచి నివేదిక తీసుకుంది.

వచ్చేనెల 1న ముగియనున్న గడువు

ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా 1,740 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. నల్లగొండ జిల్లాలో 844, సూర్యాపేట జిల్లాలో 475, యాదాద్రి జిల్లాలో 421 పంచాయతీలు ఉన్నాయి. ఆయా జిల్లాలో 2019 జనవరి 24, 27, 30 తేదీల్లో రెవెన్యూ డివిజన్ల వారీగా సర్పంచుల ఎన్నికలు నిర్వహించారు. అప్పట్లో ఎన్నికైన పాలక వర్గాలు ఫిబ్రవరి 2వ తేదీన బాధ్యతలు చేపట్టాయి. ఈ నేపథ్యంలో పాలక వర్గాల గడువు ముగుస్తుండటంతో ఎన్నికలకు ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ నెలన్నర ముందే సిద్ధమైంది తప్ప నోటిఫికేషన్ జారీ చేయలేదు. కేవలం ఆరు రోజులే ప్రస్తుత పంచాయతీల పాలక వర్గాలకు గడువు ఉండటంతో ప్రభుత్వం పాత సర్పంచుల పదవీ కాలాన్ని పొడిగిస్తుందా? లేదంటే అధికారులకు బాధ్యతలు ఇచ్చి ప్రత్యేక అధికారుల పాలన కొనసాగిస్తుందా? అనేది ఈ వారంలో స్పష్టత రానుంది. గ్రామపంచాయతీల పాలకవర్గాల గడువు ఫిబ్రవరి 1వ తేదీన ముగుస్తుండటంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక అధికారుల పాలనకు మొగ్గు చూపుతున్నట్టు తెలుస్తోంది. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చిన వెంటనే ఈనెల 30 లేదా 31 తేదీల్లో కలెక్టర్లు ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసే అవకాశాలు ఉన్నాయి. అయితే సర్పంచులు తమ పదవీ కాలాన్ని మరో ఆరునెలల పాటు పొడిగించాలని, గతంలో చేసిన పనులకు ఇప్పటి వరకు బిల్లులు రాకపోవడంతో అప్పుల్లో కూరుకుపోయామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే ప్రభుత్వం సర్పంచుల పదవీ కాలాన్ని పొడిగించే బదులు అధికారులకే బాధ్యతలు అప్పగించే ఆలోచనలో ఉంది.

ప్రత్యేకాధికారి పోస్టింగ్‌కు రాజకీయ జోక్యం

ప్రత్యేక అధికారుల పాలన ప్రారంభం కానునుండటంతో ప్రతీ పంచాయతీకి ఒక అధికారిని నియమించాలి. దీంతో జిల్లా అధికారులు ఆ పనుల్లో నిమగ్నమయ్యారు. దీంతో పోస్టింగ్ విషయంలో రాజకీయ జోక్యం మొదలైంది. ఇప్పటికే అధికారుల జాబితా తయారవుతుండటంతో చాలా ప్రాంతాల్లో రాజకీయ నాయకుల ఒత్తిడి పెరిగడంతో జాబితా తయారీని నిలిపివేసినట్లు సమాచారం. ఓ వైపు అధికారులు జాబితా తయారీలో నిమగ్నం కాగా, రాజకీయ ఒత్తిళ్లు పెరగడంతో సమస్యలు ఎదురవుతున్నట్టు తెలిసింది. పలు శాఖల్లో పనిచేసే, మండలస్థాయిలో పనిచేసే సీనియర్ అసిస్టెంట్ మొదలు సూపరింటెండెంట్ల వరకు పేర్లను అధికారులు సేకరించారు. అధిక జనాభా ఉన్న పంచాయతీలకు తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంపీవోలకు, చిన్న పంచాయతీలకు సీనియర్ అసిస్టెంట్లు, టైపిస్టులతో అధికారులు జాబితా సిద్ధం చేశారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా 1,740మంది ప్రత్యేక అధికారుల అవసరం ఉంది. చాలా చోట్ల నచ్చిన అధికారిని నియమించుకునేందుకు రాజకీయ నాయకులు ముమ్మరంగా పైరవీలు సాగిస్తున్నారు. అదేవిధంగా కొన్ని గ్రామపంచాయతీలకు చెందిన సర్పంచులు తాము చేసిన అక్రమాలు ఎక్కడ బయట పడతాయనే భయంతో నిక్కచ్చిగా ఉండి కఠినంగా వ్యవహరించే అధికారి కాకుండా, అనుకూలంగా ఉండేవారికి పోస్టింగ్ ఇచ్చేలా పైరవీలు చేస్తున్నట్టు తెలుస్తోంది.

● ప్రభుత్వం నుంచి అధికారిక సమాచారం లేదు

ఈ ఏడాది ఫిబ్రవరి 1 వరకు పంచాయతీల ప్రస్తుత పాలకవర్గాల గడువు ఉంది. 2019 ఫిబ్రవరి 2న ప్రస్తుత పాలకవర్గాలు ప్రమాణస్వీకారం చేశాయి. ప్రత్యేక అధికారుల పాలనకు సంబంధించి ప్రభుత్వం నుంచి ఇంకా అధికారిక సమాచారం ఇప్పటి వరకు రాలేదు. ఏ క్షణమైనా ఆదేశాలు రావొచ్చు. అందుకు అనుగుణంగా అన్ని పంచాయతీలకు అవసరమైన అధికారుల జాబితా సిద్ధం చేశాం. అధిక జనాభా ఉన్న పంచాయతీలకు తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంపీవోలకు, చిన్న పంచాయతీలకు సీనియర్ అసిస్టెంట్లు, టైపిస్టులతో జాబితా సిద్ధం చేశాం. వ్యవసాయ, ఇంజనీరింగ్, పశువైద్యం, పంచాయతీ ఇలా అన్ని శాఖల నుంచి అధికారులు, సిబ్బందిని పంచాయతీలకు ప్రత్యేక అధికారులుగా తీసుకుంటాం.

- విష్ణువర్ధన్‌రెడ్డి, నల్లగొండ జిల్లా పంచాయతీ అధికారి



జాన్‌పహాడ్ ఉర్సు సందర్భంగా దర్గాలో నిర్వహించిన ప్రార్థనల్లో పాల్గొన్న మహిళలు

జాన్‌పహాడ్ దర్గా ఉర్సు షురూ

● దర్గాలో దీపం వెలిగించి ఉర్సును ప్రారంభించిన ముజావర్ ● నేడు గంధం ఊరేగింపు

పాలకవీడు, జనవరి 25: భక్తుల ఆరాధ్య దైవంగా నిలుస్తున్న సూర్యాపేట జిల్లా జాన్‌పహాడ్ సైదులు దర్గా ఉర్సు గురువారం ఘనంగా ప్రారంభమైంది. తెల్లవారుజామున స్వామి వారిని పెళ్లికుమారుడిగా ముస్తాబు చేసి, కొవ్వొత్తుల హారతుల నడుమ దర్గాలోని హజ్రత్ సయ్యద్ మోహినుద్దీషా, జాన్‌పాక్ షహీద్ రహమతుల్లా సమాధులపై గంధం ఎక్కించి పూజా కార్యక్రమాలను ప్రారంభించారు. దర్గాలోని నాగేంద్రుడి పుట్టకు హిందువులతో పాటు ముస్లిం మహిళలు పాలు, గుడ్లు సమర్పించి, దీపాలు వెలిగించి మొక్కు తీర్చుకున్నారు. ఉర్సు సందర్భంగా ఫకీరులు ఖవ్వాలి నిర్వహిస్తూ ముస్లిం సంప్రదాయ పద్ధతిలో నృత్యాలు చేశారు. పూజారులు దర్గాలోని రెండు సమాధులపై హైదరాబాద్ నుంచి తెప్పించిన పూలు, ప్రత్యేక దట్టీలు కప్పి సైదులు బాబా సమాధులను సుందరంగా అలంకరించారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అదేవిధంగా సైదులుబాబాకు అంగరక్షకుడిగా ఉన్న సిపాయి బాబా సమాధి వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. శుక్రవారం నిర్వహించే గంధం ఊరేగింపునకు భక్తులు పెద్దసంఖ్యలో గురువారం సాయంత్రం నుంచే దర్గాకు చేరుకున్నారు. ఉర్సు సందర్భంగా దర్గా పరిసర ప్రాంతాల్లో వివిధ రకాల దుకాణాలు ఏర్పాటయ్యాయి. చుట్టుపక్కల తండాల ప్రజలు బంధువులను ఆహ్వానించి కందూరు చేస్తున్నారు. భక్తుల రాకతో దర్గా పరిసర ప్రాంతాలు సందడిగా మారాయి.

ప్రభుత్వ శాఖల శిబిరాలు

దర్గా సమీపంలో ప్రభుత్వ శాఖలకు సంబంధించిన శిబిరాలను ఏర్పాటుచేశారు. వైద్య, రెవెన్యూ, పంచాయతీరాజ్, అగ్నిమాపక శాఖలు స్టాళ్లను ఏర్పాటు చేశాయి. కోదాడ నుంచి నేరేడుచర్ల మీదుగా ప్రత్యేకంగా 15 ఆర్టీసీ సర్వీసులను, మిర్యాలగూడ డిపో నుంచి దామరచర్ల మీదుగా 15 ఆర్టీసీ సర్వీసులను నిరంతరాయంగా నడుపుతున్నారు. ఆర్టీసీ బస్సులతో పాటు ఆటోలు, ట్రాక్టర్లు, లారీలు తదితర ప్రైవేటు వాహనాల్లో ఇప్పటికే భక్తులు పెద్దసంఖ్యలో దర్గాకు చేరుకుంటున్నారు. చలి తీవ్రత ఎక్కువగా ఉండడంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు.



దర్గాలో దీపాన్ని వెలిగిస్తున్న ముజావర్ జానీ

నేడు గంధం ఊరేగింపు

ఉర్సు ఉత్సవాల్లో ప్రధాన ఘట్టం గంధం ఊరేగింపు. శుక్రవారం నిర్వహించే ఈ ఉత్సవానికి భారీ సంఖ్యలో భక్తులు హాజరవుతారు. తొక్కిసలాట జరగకుండా పోలీసులు రోప్ పార్టీలను నియమించారు. వక్ఫ్‌బోర్డు నుంచి ఉదయం 9 గంటలకు సందల్‌ఖానా నుంచి గంధం ఊరేగింపు మొదలవుతుంది. అక్కడి నుంచి జాన్‌పహాడ్, చెర్వుతండా వరకు గుర్రాల మీద తీసుకువెళ్తారు. తిరిగి ఒంటి గంటకు గంధాన్ని జాన్‌పహాడ్ దర్గా వద్దకు తీసుకువస్తారు. దర్గా లోపల ఉన్న భక్తులను బయటకు పంపి దర్గాలో గంధం ఎక్కిస్తారు. గంధాన్ని అత్యంత అందుకునేందుకు భక్తులు ఎగబడతారు. ఈ నేపథ్యంలో భారీ బందోబస్తును ఏర్పాటుచేశారు. 500 మంది పోలీసు సిబ్బంది 24 గంటల పాటు రెండు విడతల్లో విధులు నిర్వహిస్తారు. 16 సీసీ కెమెరాలు ఏర్పాటుచేశారు. వాహనదారుల కోసం ప్రత్యేక పార్కింగ్ స్థలాలు కేటాయించారు.



పరేడ్ గ్రౌండ్‌లో పరేడ్ రిహార్సల్ నిర్వహిస్తున్న పోలీసులు

నేడు గణతంత్ర దినోత్సవం

నల్లగొండ, జనవరి 25: గణతంత్ర దినోత్సవం నిర్వహణకు జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్‌గ్రౌండ్‌లో ఏర్పాట్లు పూర్తయ్యాయి. గణతంత్ర దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఉదయం 9గంటలకు పరేడ్ గ్రౌండ్‌లో జాతీయ పతాకాన్ని కలెక్టర్ హరిచందన ఆవిష్కరించనున్నారు. అనంతరం పోలీసుల గౌరవ వందనం స్వీకరించి ప్రసంగిస్తారు. 9.30గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలు, 9.50కు ఆస్తుల పంపిణీ, శకటాల ప్రదర్శన, అనంతరం ఉత్తమ అధికారులకు ప్రశంసా పత్రాలు అందజేయనున్నారు.

కాలానికి అనుగుణంగా విద్య అందించాలి


ఎంజీయూ వీసీ గోపాల్‌రెడ్డి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంజీయూ వీసీ గోపాల్‌రెడ్డి

నల్లగొండ, జనవరి 25: మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యా బోధన చేయాలని ఎంజీయూ వీసీ సీహెచ్.గోపాల్‌రెడ్డి అన్నారు. చర్లపల్లిలోని డీవీఎం కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్‌లో ఎంఈడీ పూర్తిచేసిన ప్రథమ బ్యాచ్ విద్యార్థుల కాన్వకేషన్‌లో ఆయన మాట్లాడారు. విద్యార్థుల్లో సామాజిక విలువలతో పాటు ఇతరులను గౌరవించే నైపుణ్యాలను పెంపొందించాలన్నారు. కార్యక్రమంలో నేషనల్ కౌన్సిల్ ఆఫ్ టీచర్ ఎడ్యుకేషన్ గౌరవ సభ్యుడు పి.శంకర్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.గంగాధర్‌రావు, వైస్ ప్రిన్సిపాల్ బొడ్డుపల్లి రామకృష్ణ, దొడ్డ సోమరాజు, బి.నారాయణరెడ్డి, ఎన్.శ్రీదేవి, జె.పుష్పాంజలి, పాల్గొన్నారు.

పెండింగ్ ప్రాజెక్టులను పూర్తిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న నెల్లికంటి సత్యం

చండూరు, జనవరి 25: జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ఎస్ఎల్‌బీసీ, డిండి ఎత్తిపోతల పథకంలో భాగమైన చర్లగూడెం, బ్రాహ్మణవెల్లెంల ప్రాజెక్టులకు అధిక నిధులు కేటాయించి పూర్తిచేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం డిమాండ్ చేశారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో బీజేపీ మతోన్మాద రాజకీయాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. దేశ సంపదను అదానీ, అంబానీ, టాటా, బిర్లాకు ప్రధాని మోదీ ధారాదత్తం చేస్తున్నారని ఆరోపించారు. సమావేశంలో నాయకులు నలపరాజు రామలింగయ్య ఆర్.అంజాచారి, బచ్చనగోని గాలయ్య, టి.వెంకటేశ్వర్లు, గురిజ రామచంద్రం, నలపరాజు సతీష్, చాపల శ్రీను, భిక్షంరెడ్డి, రమేష్, శేఖర్‌రెడ్డి, సురేష్, పాల్గొన్నారు.

అర్హులు ఓటరుగా నమోదు చేసుకోవాలి

● కలెక్టర్ హరిచందన



కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరిచందన

నల్లగొండ టౌన్, జనవరి 25: అర్హులైన ప్రతీ ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకోవడంతో పాటు ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ హరిచందన అన్నారు. గురువారం జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని ఎన్జీ కళాశాల వద్ద నిర్వహించిన అవగాహన ర్యాలీని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. విద్యార్థులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ ఎన్జీ కళాశాల నుంచి రామగిరి మీదుగా క్లాక్ టవర్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఇక్కడ నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతీ ఓటరు నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకునే అవకాశాన్ని ఎన్నికల సంఘం కల్పించిందన్నారు. ప్రతీ ఒక్కరు బాధ్యతగా ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. పట్టణ ప్రాంతాల్లో ఓటింగ్ శాతం పెంచేందుకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. 80ఏళ్లు దాటిన వయోవృద్ధులు, దివ్యాంగులు ఇంటి వద్ద ఉండే ఓటు వేసే అవకాశం ఉందన్నారు. ప్రతీ ఒక్కరు ఓటరు జాబితాలో వారి పేరును సరిచూసుకోవాలని సూచించారు. త్వరలో జరగనున్న నల్లగొండ-వరంగల్-ఖమ్మం గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఉపఎన్నికలో ఓటు వేసేందుకు అర్హత కలిగిన పట్టభద్రులు ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవాలన్నారు. ఇది వరకు ఓటరుగా ఉన్న వారు సైతం మళ్లీ ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. 2023 నవంబరు 1కి మూడేళ్ల ముందు, అంటే 2020 నవంబరు 1 నాటికి గ్రాడ్యుయేట్ ఉత్తీర్ణులైనవారు, నియోజకవర్గంలో నివాసితులైనవారు ఓటరుగా నమోదుకు అర్హులని తెలిపారు. అదనపుకలెక్టర్ జె.శ్రీనివాస్ మాట్లాడుతూ, స్వీప్ కార్యక్రమం ద్వారా ఓటరు నమోదు, ఓటు హక్కు వినియోగంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చొల్లేటి ప్రభాకర్ మాట్లాడుతూ, ఎన్నికల్లో డబ్బు, ఇతరత్రా ప్రలోభాలకు లొంగకుండా నిర్భయంగా ఓటు వేయాలని అన్నారు. అనంతరం యువ ఓటర్లకు ఫొటో ఓటరు గుర్తింపు కారులను కలెక్టర్ పంపిణీ చేశారు. 80 ఏళ్లు దాటిన వృద్ధ ఓటర్లను ఈ సందర్భంగా శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో ప్రేమ్‌కరణ్‌రెడ్డి, ఆర్డీవో రవి, వివిధ శాఖల అధికారులు, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

టీఎస్పీఎస్సీ కమిటీలో
ఉమ్మడి జిల్లా వాసులు

సభ్యులుగా పాల్వాయి రజని, నర్రి యాదయ్య




పాల్వాయి రజనీకుమారి, నర్రి యాదయ్య

సూర్యాపేట టౌన్ / సంస్థాన్‌నారాయణపురం, జనవరి 25 : ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన ఇరువురికి కీలక పదవులు లభించాయి. జాబ్‌క్యాలెండర్ నిర్వహణను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వం ఆ మేరకు టీఎస్పీఎస్సీ కమిటీ సభ్యులుగా సూర్యాపేట జిల్లాకు చెందిన పాల్వాయి రజనీకుమారి, యాదాద్రిభువనగిరి జిల్లాకు చెందిన నర్రి యాదయ్యను ఎంపిక చేస్తూ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. సూర్యాపేట జిల్లా కేంద్రానికి చెందిన రజనీకుమారి హైదరాబాద్ మునిసిపల్ కమిషనర్‌గా పనిచేశారు. 2004లో టీడీపీ తరుపున సూర్యాపేట అసెంబ్లీ స్థానానికి పోటీ చేసి ఓడిపోయారు. అనంతరం బీజేపీలో చేరారు. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల ముందు రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆమె ఎంపికపై పట్టణవాసులు హర్షం వ్యక్తం చేశారు. అదేవిధంగా యాదాద్రిభువనగిరి జిల్లా సంస్థాన్‌నారాయణపురం మండలం మల్లారెడ్డిగూడెం గ్రామానికి నర్రి యాదయ్య కమిటీ సభ్యుడిగా నియమితులయ్యారు. ప్రస్తుతం ఆయన జేఎన్‌టీయూ రిజిస్ట్రార్‌గా వ్యవహరిస్తున్నారు. దుర్గయ్య, మల్లమ్మల కుమారుడైన యాదయ్యది నిరుపేద కుటుంబం. పదో తరగతి వరకు సర్వేల్ ఉన్నత పాఠశాలలో, ఉస్మానియా నుంచి ఇంజనీరింగ్, ఐఐటీ ఖరగ్‌పూర్‌లో ఎంటెక్ చేశారు. వివిధ బాధ్యతలు నిర్వహించిన యాదయ్య ఎంపిక కావడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

కార్మికుల సమ్మెను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ

దేవరకొండ, జనవరి 25: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఫిబ్రవరి 16న నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్.లక్ష్మీనారాయణ అన్నారు. గురువారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ అధికారంలో ఉన్న పదేళ్లలో రైతులు, కార్మికుల సమస్యలను పట్టించుకోలేదన్నారు. ఏటా 2కోట్ల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చి అమలు చేయడంలో విఫలమైందన్నారు. ప్రభుత్వ సంపదను, సహజ వనరులను కార్పొరేట్ శక్తులకు అప్పగించి కార్మికులను ఇబ్బందులుకు గురి చేస్తోందని ఆరోపించారు. ఫిబ్రవరి 16న నిర్వహించే సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సంఘం జిల్లా సహాయకార్యదర్శి నల్ల వెంకటయ్య, నాగరాజు, బిజిలి లింగయ్య, శైలు, విమల, పుష్పలత, లక్ష్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

200 రోజులు పని కల్పించాలి

ఉపాధిహామీ పథకం ద్వారా 200 రోజులు పని కల్పించాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా కూలి చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కలకొండ కాంతయ్య డిమాండ్ చేశారు. గురువారం స్థానిక సీపీఐ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పని ప్రదేశాల్లో ఉపాధి కూలీల ఫొటోలు తీసే విధానాన్ని కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని, కూలీలకు మెరుగైన వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నర్సింహారెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి నర్సింహ, నాయకులు వెంగలయ్య, కిషన్, బారీముల్లా, అబీబ్, పుల్లయ్య, శ్రీరాములు, వెంకటయ్య, శంకర్, తదితరులు పాల్గొన్నారు.



కమలాద్రి లక్ష్మీ నరసింహుడి కల్యాణం

నార్కట్‌పల్లి, జనవరి25: నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని శాపల్లి గ్రామంలో కమలాద్రి కొండపై కొలువై ఉన్న లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానంలో వార్షిక అధ్యయన బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాలలో భాగంగా గురువారం లక్ష్మీ నరసింహుల కల్యాణోత్సవం కన్నుల పండువగా జరిగింది. మంగళవాయిద్యాలు, అర్చకస్వాముల వేద మంత్రోశ్చారణల మధ్య స్వామి అమ్మవార్ల కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. ఆలయ అనువంశీక అర్చకులు కారంపూడి నరసింహాచార్యులు, రాకేశాచార్యులు ఇతర అర్చక బృందం ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలు నిర్వహించారు. నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం కల్యాణ ఉత్సవానికి ముందు ఆలయంలో జరిగిన పూజల్లో పాల్గొన్నారు.



దేవాలయాల్లో చోరీ చేసిన నిందితుల అరెస్టు

తొర్రూరు (మహబూబాబాద్ జిల్లా), జనవరి 25 : తొర్రూరు డివిజన్ పరిధిలోని మరిపెడ, తొర్రూరు, దంతాలపల్లి మండలాల్లోని గ్రామాల్లో ఉన్న దేవాలయాల్లో దొంగతనాలకు పాల్పడిన నిందితులను అరెస్టు చేసినట్లు డీఎస్పీ వెంకటేశ్వరబాబు తెలిపారు. గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో జరిగిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. నల్లగొండ జిల్లా నకిరేకల్ మండలానికి చెందిన ఆరుగురు వ్యక్తులు ముఠాగా ఏర్పడ్డారు. వారు మహబూబాబాద్ జిల్లాలో దంతాలపల్లి మండలం పెద్ద ముప్పారంలోని వేంకటేశ్వర స్వామి ఆలయం, తొర్రూరు మండలం మాటేడు వేణుగోపాలస్వామి, అమ్మాపురం సీతారామచంద్రస్వామి, మరిపెడ మండలం గుండెపుడిలోని సీతారామస్వామి ఆలయాల్లో దేవుడి విగ్రహాలను ఊరేగింపు సమయంలో చేపట్టే ఉత్సవవిగ్రహాలు, గరుడవాహనం, అశ్వ వాహనం, ఇత్తడి గొడుగు, దివిటీలు దొంగిలించేవారు. నకిరేకల్ మండల కేంద్రానికి చెందిన చింతల పుల్లారావు అనే పాత ఇనుప సామాను కొనుగోలు వ్యక్తికి విక్రయిస్తారు. మరిపెడ మండలంలోని ఎల్లంపేట శివారు జమ్మికుంట తండాలో ట్రాన్స్‌ఫారం, కాపర్ వైరు కూడా దొంగిలించి విక్రయించగా గుండెపుడి ఆలయ ఆవరణలో దొంగతనం చేసినపుడు పోలీసులు విచారణ చేపట్టగా మహిళలు కూడా ఈ దొంగతనం చేసినట్లు గుర్తించి డివిజన్ పరిధిలోని సీఐల ఆదేశాల మేరకు పోలీసులు టీమ్‌గా ఏర్పడి విచారణ చేపట్టారు. నిందితులు ఉపయోగించిన ఆటో సీసీ కెమెరాలో కనిపించడంతో గురువారం తొర్రూరు ఎస్సై సతీష్ వాహనాలు తనిఖీ చేస్తుండగా నిందితులు ఆవుల సంజీవ, నాగిళ్ల నాగరాజు, ఎడ్ల వెంకటమ్మ, ఎడ్ల పున్నమ్మ, నాగిళ్ల దుర్గ, గోపగాని రాజమ్మ ఆరుగురు చింతల పుల్లారావుతో కలిసి వెళ్తుండడంతో సమాచారం మేరకు పట్టు కుని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించడం జరిగిందన్నారు. వీరి వద్ద నుంచి రూ.60 వేల నగదు, రెండు క్వింటాల ఇత్తడి విగ్రహాలు, కాపర్‌వైరు స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ చూపిన పోలీసులకు డీఎస్పీ రివార్డులు అందజేశారు. డివిజన్ పరిధిలోని సీఐలు కరుణాసాగర్, సత్యనారాయణ, ఎస్సైలు సతీష్, తహేర్‌బాబా, జగదీష్ ఉన్నారు.


పోలీసులు స్వాధీనం చేసుకున్న దేవుడి వాహన విగ్రహాలు

యూటీఎఫ్ సమావేశాలను విజయవంతం చేయాలి


చింతపల్లి, జనవరి 25: నల్లగొండ జిల్లా శాలిగౌరారంలో ఈనెల 28న నిర్వహించనున్న టీఎస్ యూటీఎఫ్ జిల్లా విస్తృత సమావేశాలను జయప్రదం చేయాలని ఆసంఘం జిల్లా కార్యదర్శి కోట్ల యాదగిరి పిలుపునిచ్చారు. నల్లగొండ జిల్లా చింతపల్లి మండలంలోని కిష్టరాయన్‌పల్లి పాఠశాలలో పోస్టర్‌ను గురువారం ఆవిష్కరించారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం టీఎస్‌యూటీఎఫ్ ముందుండి పోరాడుతుందన్నారు. ఉపాధ్యాయులు ప్రధాన సమస్యలు చర్చించడంతోపాటు ఇతర ముఖ్యాంశాలు రాష్ట్ర బాధ్యుల సమక్షంలో చర్చించనున్నట్లు తెలిపారు. 28న నిర్వహించనున్న యూటీఎఫ్ విస్తృత సమావేశాలకు జిల్లాలోని ఉపాధ్యాయులందరూ అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు.













గణతంత్ర వేడుకలకు పారిశుధ్య కార్మికురాలు



పిడతల నాగలక్ష్మి

కోదాడ రూరల్, జనవరి 25: ఢిల్లీలో శుక్రవారం నిర్వహించే గణతంత్ర వేడుకల్లో పాల్గొనేందుకు సూర్యాపేట జిల్లా కోదాడ మండలంలోని కొమరబండ గ్రామానికి చెందిన పిడతల నాగలక్ష్మి ప్రత్యేక ఆహ్వానితురాలిగా గురువారం వెళ్లారు. నాగలక్ష్మి కోదాడ మున్సిపాలిటీలో మొబైల్ షీ-టాయిలెట్స్ డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. ఆమె పనితీరుకు మెచ్చి ఢిల్లీలో జరిగే గణతంత్ర దినోత్సవానికి ఎంపిక చేసినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. కొమరబండకు చెందిన నాగలక్ష్మి చిన్నతనంలోనే తల్లిని కోల్పోయినా పట్టుదలతో చదువుకుని బీఏ, బీఈడీ పూర్తిచేసింది. ఉద్యోగాల కోసం అన్వేషణలో ఉండగా, స్థానిక మున్సిపాలిటీలో పారిశుధ్య కార్మికురాలిగా అవకాశం లభించింది. రాష్ట్రం నుంచి మొత్తం 18మంది పారిశుధ్య కార్మికులు ఎంపిక కాగా, అందులో నాగలక్ష్మి ఒకరు. మొబైల్ షీ-టాయిలెట్స్ ద్వారా ఆమె మహిళల సేవలందించారు. గణతంత్ర్య దినోత్సవాల్లో పాల్గొనేందుకు అర్హత సాధించిన వెళ్లిన ఆమెను కొమరబండలోని మహిళా సంఘాలు ఘనంగా సన్మానించాయి.

ఇసుక టిప్పర్ సీజ్

కోదాడ రూరల్, జనవరి 25: సూర్యాపే జిల్లా కోదాడ మండలంలోని గుడిబండ గ్రామం వద్ద ఇసుక టిప్పర్‌ను పోలీసులు గురువారం సీజ్ చేశారు. హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం... ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎన్టీఆర్ జిల్లా రావిరాల నుంచి కోదాడకు అక్రమంగా వస్తున్న ఇసుక టిప్పర్‌ను గుడిబండ వద్ద పోలీసులు సీజ్ చేశారు. ఆంధ్రా నుంచి తెలంగాణలోకి ఇసుక అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెడ్‌కానిస్టేబుల్ హెచ్చరించారు.

బేకరీలపై లీగల్ మెట్రాలజీ అధికారుల దాడులు



బేకరిలో నాణ్యతాప్రమాణాలను పరిశీలిస్తున్న అధికారి

నల్లగొండ టౌన్, జనవరి 25: నల్లగొండ జిల్లాకేంద్రంలో నిబంధనలకు విరుద్ధంగా వ్యాపారాలు నిర్వహిస్తున్న బేకరీలపై తూనికలు కొలతల శాఖ అధికారులు గురువారం దాడులు నిర్వహించారు. ఉమ్మడి జిల్లా లీగల్ మెట్రాలజీ అధికారి పి. రామకృష్ణ ఆధ్వర్యంలో పట్టణంలోని పలు బేకరీల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. బ్రెడ్ ప్యాకెట్లపై తయారీ, అడ్రస్, నెట్ క్వాంటిటీ, తేదీ, కస్టమర్ కేర్ చిరునామా, ఫోన్ నెంబర్, ఇ-మెయిల్ ఐడీ వంటి వివరాలు లేకపోవడాన్ని గుర్తించారు. అదేవిధంగా సాయి కేక్స్ అండ్ బేకరీ, డాల్ఫిన్ బేకరీల్లో కేజీ కేకుకు 150 గ్రాముల తక్కువగా ఉండడాన్ని గుర్తించి వారిపై కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా లీగల్ మెట్రాలజీ అధికారి రామకృష్ణ మాట్లాడుతూ బేకరీ నిర్వాహకులంతా సరైన తూకం పాటించాలన్నారు. ప్యాకేజీ డెకరేషన్లు తప్పనిసరిగా ఉండాలన్నారు. లేనిపక్షంలో కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

అభివృద్ధికి కారిడార్

● ఔటర్ నుంచి రీజనల్ దాకా అభివృద్ధి లింకు ● పారిశ్రామిక కేంద్రాల ఏర్పాటుపై కసరత్తు ● అభివృద్ధిపై దృష్టి



యాదాద్రి జిల్లా చౌటుప్పల్ మండలం దండు మల్కాపురంలో ఏర్పాటు చేసిన పారిశ్రామిక పైలాన్

చౌటుప్పల్, జనవరి 25: హైదరాబాద్ చుట్టుపక్కల ప్రాంతాలను అభివృద్ధి చేసి వాటి రూపురేఖలను మార్చేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. రాజధాని శివారులో ఏర్పాటు చేసిన ఔటర్ రింగ్‌రోడ్డు నుంచి రీజనల్ రింగ్‌రోడ్డు(ఆర్ఆర్ఆర్) వరకు అభివృద్ధి కారిడార్‌ను ఏర్పాటు చేసేందుకు కార్యాచరణ రూపొందిస్తోంది. ఔటర్ రింగ్ రోడ్డు నుంచి రీజనల్ రింగ్ రోడ్డు దాకా అభివృద్ధి వేగవంతం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల అధికారులను ఆదేశించారు. ఈ ప్రాంతాల్లో పారిశ్రామిక క్లస్టర్లను ఏర్పాటు చేసి పారిశ్రామికంగా మరింత అభివృద్ధి పరచడంతో పాటు ఉద్యోగ ఉపాధి కల్పనకు అధిక ప్రాధాన్యం ఇచ్చేందుకు కసరత్తు ప్రారంభించనున్నారు. ఇందుకోసం శివారు ప్రాంతాలను మూడు క్లస్టర్లుగా విభజించనున్నారు. ఈ ప్రాంతాలను నగరంతో సమానంగా అభివృద్ధి చేసేందుకు కావల్సిన మౌలిక సదుపాయాల కల్పనపై ప్రభుత్వం దృష్టి కేంద్రీకరించింది. హైదరాబాద్ నగర జనాభా రోజురోజుకూ పెరుగుతోంది. దానికి అనుగుణంగా నగరాన్ని విస్తరించాల్సి ఉంది. అందులో భాగంగా శివారు ఔటర్ రింగ్‌రోడ్డు నుంచి త్వరలో నిర్మించ తలపెట్టిన రీజనల్‌రింగ్ రోడ్డు వరకు మధ్యన ఉన్న ప్రాంతాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. పారిశ్రామికవాడ, మినీ నగరాలు, రియల్ ఎస్టేట్ వంటి వాటిని అభివృద్ధి చేసేందుకు కార్యాచరణ రూపొందిస్తోంది.

మూడు క్లస్టర్లుగా విభజన

మూడు క్లస్టర్లుగా విభజించేందుకు కసరత్తు ప్రారంభించింది. ఔటర్ రింగ్ రోడ్డు లోపల భాగాన్ని అర్బన్ క్లస్టర్‌గా, ఓఆర్ఆర్ నుంచి ఆర్ఆర్ఆర్ వరకు ప్రాంతాన్ని సెమీ అర్బన్‌క్లస్టర్‌గా, రీజనల్ రింగ్‌రోడ్ అవతల ప్రాంతాన్ని రూరల్ క్లస్టర్లుగా ఏర్పాటు చేయనుంది. ఏ క్లస్టర్లలో ఏది ఏర్పాటు చేస్తే ఆ ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయన్న దానిపై ప్రభుత్వం సమాలోచనలు చేస్తోంది. అర్బన్ క్లస్టర్ ప్రాంతం ఇప్పటికే అభివృద్ధిలో ఉంది. రాజధాని మధ్య ప్రాంతం నుంచి ఈ క్లస్టర్ చివరి వరకు ఇప్పటికే అన్ని రకాల వ్యాపార వాణిజ్య సంస్థలు బహుళ అంతస్తుల భవనాలు, నగర సముదాయాలు ఏర్పాటయ్యాయి. నిర్మాణ రంగం సైతం విస్తరిస్తోంది. రానున్న రోజుల్లో నగరం లోపల అటు ప్రభుత్వ పరంగా ఇటు ప్రైవేట్ పరంగా ఏవైనా భారీ ప్రాజెక్టులు ఏర్పాటు చేయాలనుకున్నా స్థలాలు దొరకని పరిస్థితి ఏర్పడనుంది. ఓఆర్ఆర్ నుంచి ఆర్ఆర్ఆర్ వరకు మధ్య ప్రాంతాన్ని సెమీ అర్బన్ క్లస్టర్‌గా విభజించనున్నారు. ఈ ప్రాంతం ఇప్పుడిప్పుడే అభివృద్ధి వైపు అడుగులు వేస్తోంది. ఈ ప్రాంతంలో ఇప్పటికే నిర్మాణరంగం పనులు సాగుతున్నాయి. నగరంలో స్థిరపడ్డ ప్రజలు కాంక్రీట్ జంగిల్ వాతావరణం నుంచి బయటపడేందుకు యోచిస్తున్నారు. ఈ ప్రాంతంలో ఇప్పటికే చాలామంది పెట్టుబడిదారులు ప్రముఖులు వ్యాపారవేత్తలు ప్రజలు గెస్ట్‌హౌస్, ఫామ్‌హౌస్‌లు నిర్మించుకున్నారు. ఇక్కడ బహుళ అంతస్తుల భవనాలు, మినీ నగరాలను ఏర్పాటు చేసే ప్రక్రియను గత ప్రభుత్వం ప్రారంభించినప్పటికీ ఆశించిన స్థాయిలో ముందుకు సాగలేదు. తాజాగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నగర శివారు ప్రాంతాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరిస్తున్నట్లు వెల్లడించారు. దీంతో ఈ ప్రాంతంలో నిర్మాణ రంగాన్ని హర్టికల్ రంగాన్ని మరింత పెంపొందించి ఇక్కడ నగరానికి దీటుగా అన్ని సౌకర్యాలతో మినీ నగరాలను ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం ముందుకు వెళ్లే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. నిర్మాణరంగంతో పాటు భవిష్యత్తులో ప్రభుత్వపరంగా ఏ ప్రాజెక్టులు ఏర్పాటు చేయాలనుకున్న సెమీ అర్బన్‌జోన్ ప్రాంతాన్ని వినియోగించుకునేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ ప్రాంతం రాజధాని నగరానికి ఆనుకొని ఉండడం, ఇక్కడ ఏర్పాటు చేతన పెట్టిన ప్రాజెక్టులకు సంబంధించి అన్ని రకాల సదుపాయాలు అందుబాటులో ఉండడం ఈ ప్రాంత అభివృద్ధికి కలిసి వచ్చే మరో అవకాశంగా కన్పిస్తోంది. రీజనల్ రింగ్‌రోడ్ అవతలి ప్రాంతాన్ని ప్రభుత్వం రూరల్ క్లస్టర్‌గా విభజించన న్నారు. రూరల్ క్లస్టర్ ప్రాంతాన్ని సైతం అభివృద్ధి పరిచేందుకు ప్రభుత్వం కార్యాచరణ రూపొందించే పనిలో నిమగ్నమైంది. ఈ ప్రాంతం ఎలాంటి ప్రాజెక్టులకు అనుకూలంగా ఉంది. ఇక్కడ ఎలాంటి మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉన్నాయి. ఈ ప్రాంతంలో ఎలాంటి కార్యకలాపాలు చేపడితే ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందనే దానిపై ప్రభుత్వం దృష్టి కేంద్రీకరించింది. అందులో భాగంగానే ఇక్కడి భౌగోళిక పరిస్థితులు ఇక్కడ లభించే మౌలిక సదుపాయాలు వంటి అంశాలపై కార్యాచరణ ప్రణాళికలు తయారు చేస్తున్నారు.

రియల్ ఎస్టేట్‌కు మరింత ఊపు

నగరశివారు ప్రాంతాలను అభివృద్ధి చేయాలన్న యోచనలో ఉన్న ప్రభుత్వం ఈ ప్రాంతాలను మూడు క్లస్టర్లుగా విభజించడంతో రియల్ ఎస్టేట్ రంగం మరింత అభివృద్ధి చెందే అవకాశం కన్పిస్తోంది. ఇప్పటికే అర్బన్ క్లస్టర్లో పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందిన రియల్ ఎస్టేట్ రంగం ఇటీవలే సెమీ అర్బన్ క్లస్టర్లో సైతం అభివృద్ధి వైపు అడుగులు వేస్తోంది. ఇప్పటికే ఈ ప్రాంతంలో పదులు, వందల ఎకరాల్లో రియల్ ఎస్టేట్ వ్యాపార సంస్థలతో భారీ వెంచర్లు ఏర్పాటవుతున్నాయి. దానికి తోడు ప్రభుత్వం కూడా కొంతకాలంగా హెచ్ఎండీఏ ద్వారా రియల్ ఎస్టేట్ రంగానికి ప్రాధాన్యమిస్తోంది. ఈ ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ మిగులు భూములతో పాటు గత ప్రభుత్వాలు పేదలకు పంపిణీ చేసిన భూములు నిరుపయోగంగా ఉంటే వాటిలో హెచ్ఎండీఏ ద్వారా వెంచర్లు ఏర్పాటు చేసి ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చే పనిలో ఉంది. దీనికి సంబంధించి ఇప్పటికే హెచ్ఎండీఏ పరిధిలోని ఏడు జిల్లాల ప్రాంతాల్లో భాగంగా యాదాద్రి భువనగిరి జిల్లాలో చౌటుప్పల్, భూదాన్ పోచంపల్లి, బీబీనగర్ తదితర ప్రాంతాలలో వెంచర్లకు అనువుగా ఉన్న ప్రభుత్వ భూములను సేకరించేందుకు కొంతకాలంగా ప్రయత్నాలు చేస్తోంది. ఇప్పటికే రియల్ ఎస్టేట్ సంస్థలు సాగిస్తున్న వ్యాపార కార్యకలాపాలకు తోడు హెచ్ఎండీఏ కూడా ప్రభుత్వ భూముల్లో భారీ వెంచర్లు ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. హైదరాబాద్‌లో హెచ్ఎండీఏ చేసిన వెంచర్లలోని ప్లాట్లను వేలం వేయగా ప్రభుత్వానికి కొంతకాలంగా కోట్లాది రూపాయల ఆదాయం సమకూరింది. దీనిని దృష్టిలో ఉంచుకొని నగరం వెలుపల కూడా భారీ వెంచర్లు ఏర్పాటు చేస్తే ప్రభుత్వానికి ఆదాయం సమకూరే అవకాశాలు ఉన్నట్లు వ్యాపార వర్గాలు పేర్కొంటున్నాయి.

పారిశ్రామిక రంగం అభివృద్ధికి సన్నాహాలు

సెమీ అర్బన్ క్లస్టర్ ప్రాంతంలో ఇప్పటికే ఒకవైపు మినీ నగరాలు విస్తరిస్తుండగా మరోవైపు పారిశ్రామిక క్లస్టర్లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇప్పటికే ఈ ప్రాంతంలో పారిశ్రామిక రంగం సైతం అడుగుపెడుతోంది. పారిశ్రామిక రంగాన్ని సైతం మరింత అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం దృష్టి సారించింది. సెమీ అర్బన్ క్లస్టర్ ప్రాంతమైన చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం ప్రాంతంలో దేశంలోనే మొట్టమొదటి గ్రీన్ ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటైంది. నగర శివారు ప్రాంతమైన ముచ్చర్లలో ఫార్మాసిటీ సైతం ఏర్పాటైంది. దీంతో పరిశ్రమల స్థాపనకు ఈ ప్రాంతం అనుకూలంగా మారింది. దానికి తోడు ఇప్పటికే నగరంలో ఉన్న పరిశ్రమలను ఔటర్ రింగ్‌రోడ్డు అవతల ఏర్పాటు చేసుకోవాలని కొంతకాలంగా ప్రభుత్వం పరిశ్రమల యాజమాన్యాలకు నోటీసులు సైతం జారీ చేసింది. తమ పరిశ్రమలను అవుటర్ రింగ్‌రోడ్డు అవతలికి తరలించేందుకు పరిశ్రమల యాజమాన్యాలు కొంత గడువు కోరాయి. దీనికి సంబంధించి అప్పట్లో ప్రభుత్వం ఇచ్చిన గడువు సైతం పూర్తయింది. కానీ పరిశ్రమల తరలింపు ప్రక్రియ ప్రారంభం కాలేదు. పరిశ్రమల తరలింపునకు సంబంధించిన అంశాన్ని ఇటీవలే హైకోర్టు సైతం లేవనెత్తింది. తాజాగా నూతన ప్రభుత్వం చేపడుతున్న చర్యలతో హైదరాబాద్ లోపల ఉన్న పరిశ్రమలు ఇప్పటికైనా శివారు ప్రాంతాలకు తరలి వస్తాయని ప్రభుత్వం భావిస్తుంది. ఇక్కడ మరిన్ని పరిశ్రమలు ఏర్పాటు చేస్తే ప్రజలకు ఎలాంటి కాలుష్యపు ముప్పు ఉండ కుండా కాలుష్యరహిత పరిశ్రమలను మాత్రమే ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. పరిశ్రమల ఏర్పాటు ద్వారా ఈ ప్రాంత ప్రజ లకు పెద్దఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెంపొందించవచ్చని ప్రభుత్వం యోచిస్తోంది.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

కోదాడ రూరల్, మిర్యాలగూడ అర్బన్, జనవరి 25 : సూర్యాపేట, నల్లగొండ జిల్లాల్లో జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతిచెందారు. హైదరాబాద్‌కు చెందిన జంగం కీర్తిసోనిక(23) కారులో తన స్నేహితుడు రాహుల్‌తో కలిసి విజయవాడకు వెళ్తుండగా, సూర్యాపేట జిల్లా కోదాడ మండలంలోని నల్లబండగూడెం చెక్‌పోస్టు వద్ద చెక్‌పోస్టు వద్ద ముందు వెళ్తున్న లారీని కారు ఢీకొట్టింది. కీర్తిసోనికకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందింది. రాహుల్ గాయపడడంతో వెంటనే కోదాడలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, మెరుగైన వైద్యం కోసం విజయవాడ తరలించినట్లు పోలీసులు తెలిపారు. కీర్తిసోనిక తండ్రి జంగం ఆనంద్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాస్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు పేర్కొన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని..

సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండలం నర్సయ్యగూడేనికి చెందిన నెన్నపంగు మహేష్(22) నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని గాంధీనగర్‌లో కూలి పని చేసుకుంటూ తల్లితో కలిసి నివాస ముంటున్నాడు. తల్లితో గొడవపడిన మహేష్ బుధవారం రాత్రి 11గంటలకు ఇంటి నుంచి బయటుదేరాడు. రోడ్డుమార్గంలో నేరేడుచర్లవైపు నడుచుకుంటూ వెళ్తున్న క్రమంలో కోదాడ- జడ్చర్ల ప్రధాన రహదారిపై ఆలగడప టోల్‌గేట్ గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టింది. తలకు బలమైన గాయాలై అపస్మారకస్థితిలోకి వెళ్లాడు. రోడ్డుపక్కన రక్తపుమడుగులో పడివున్న యువకుడిని గుర్తించిన రాజేష్ అనే వ్యక్తి స్పందించి అంబులెన్స్‌కు సమాచారం అందించాడు. 108 వాహనంలో మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా గురువారం మహేష్ మృతిచెందినట్లు మిర్యాలగూడ రూరల్ ఎస్ఐ తెలిపారు.

'వికసిత్ భారత్' బీజేపీ లక్ష్యం



మంచినీటి క్యాన్లు అందజేస్తున్న పీవీ శ్యాంసుందర్‌రావు

నార్కట్‌పల్లి, జనవరి 25: వికసిత్ భారత్ బీజేపీ లక్ష్యమని ఆ పార్టీ భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీ శ్యాంసుందర్ రావు అన్నారు. దేశంలోని అట్టడుగు వర్గాల అభ్యున్నతికి ప్రధాని మోదీ శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నారన్నారు. నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని ఏపీ లింగోటంలో గురువారం నిర్వహించిన వికసిత్ భారత్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజలకు లబ్ధి చేసేందుకు కేంద్రం అమలుపరుస్తున్న ఉజ్వల గ్యాస్, ఆయుష్మాన్ భారత్, సుకన్య సమృద్ధి యోజన, విశ్వకర్మయోజన, పీఎం కిసాన్ నిధి, ముద్ర రుణాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కాగా పీఆర్ ఫౌండేషన్ సౌజన్యంతో గ్రామస్థులకు మంచినీటి క్యాన్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నూకల శంకర్, బీజేపీ నాయకులు నకిరెకంటి మొగిలయ్య, పోతంశెట్టి రవీందర్, కొరివి శంకర్, పంజాల నాగరాజు, పనస ఉపేందర్, గాలయ్య, సైదులు, జాని తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు కారణాలతో నలుగురు ఆత్మహత్య

● హైదరాబాద్‌లో ప్రియురాలు ఆత్మహత్య.. భువనగిరిలో ప్రియుడు ఆత్మహత్య చేసుకున్నట్లు సమాచారం

నాగార్జునసాగర్, నల్లగొండ టౌన్, అడవిదేవులపల్లి, జీడిమెట్ల, జనవరి 25: ఉమ్మడి నల్లగొండ జిల్లాలో వేర్వేరు కారణాలతో నలుగురు ఆత్మహత్య చేసుకున్నారు. కుటుంబసభ్యులతో మనస్పర్థలతో నాగార్జునసాగర్ జలాశయంలో దూకి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆర్థిక ఇబ్బందులు తాళలేక నల్లగొండకు చెందిన స్వర్ణకారుడు ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబసభ్యులు మందలించడంతో అడవిదేవులపల్లిలో ఆటో డ్రైవర్ ఆత్మహత్య చేసుకున్నాడు. ప్రేమ విఫలమై భువనగిరికి చెందిన యువకుడు హైదరాబాద్‌లో ఆత్మహత్య చేసుకున్నాడు. ఇబ్రహీంపట్నం మండలంలోని బొంగులూరుకు చెందిన బండ మల్లేష్(49) ఆటో నడుపుకుంటూ జీవనాన్ని కొనసాగిస్తున్నాడు. ఆస్తి పంపకాల్లో కుటుంబసభ్యులతో మనస్పర్థలు రావడంతో మూడురోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లి నాగార్జునసాగర్‌కు చేరుకున్నాడు. స్థానిక శివాలయం పుష్కర్‌ఘాట్ వద్ద సాగర్ డ్యామ్ స్పిల్‌వే సమీపంలోని దిగువ కృష్ణానదిలోకి దూకి రెండు రోజుల క్రితం ఆత్యహత్యకు పాల్పడ్డాడు. విద్యుత్‌కేంద్రం రివర్సబుల్ పంపింగ్ ద్వారా జలాశయంలోకి నీటిని తోడుతున్నందున మృతదేహం స్పిల్‌వే దిగువ భాగాన 22వ గేటు వద్దకు కొట్టుకువచ్చి నీటిపై తేలియాడుతుండడంతో మృతదేహాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. విజయపురిసౌత్ ఎస్ఐ వెంకటకొండారెడ్డి ఘటనాస్థలికి చేరుకుని సిబ్బంది సాయంతో నదిలో ఉన్న మృతదేహాన్ని ఒడ్డుకు చేర్చారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రేమ విఫలమై యువకుడు...

శ్రీకాకుళం జిల్లాకు చెందిన కె.దుర్గావ్ బతుకు దెరువు కోసం పది నెలల క్రితం కుటుంబ సమేతంగా నగరానికి వచ్చి జీడిమెట్ల అయోధ్య నగర్‌లో నివాసముంటున్నారు. వీరి కుమార్తె కె.అఖిల(20) సుచిత్రా సమీపంలోని పీఎస్‌కే మార్ట్‌లో ఉద్యోగం చేస్తోంది. అక్కడ మధుగౌడ్ అనే వ్యక్తిని అఖిల ప్రేమించింది. ఈ విషయం తెలిసిన తల్లిదండ్రులు యువతిని ఉద్యోగం మాన్పించి రెండు నెలల క్రితం జీడిమెట్లలోని ఓ ప్రైవేట్ కంపెనీలో చేర్పించారు. గురువారం సాయంత్రం ఓ వ్యక్తి పీఎస్‌కే మార్టు నుంచి అఖిల తమ్ముడు సాయికుమార్‌కు ఫోన్ చేసి మీ అక్క ఇంట్లో ఉందో లేదో చూడు అని చెప్పడంతో సాయికుమార్ ఇంటికి వచ్చిచూశాడు. అఖిల ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. వెంటనే పీఎస్‌కే మార్ట్ సిబ్బందికి ఫోన్‌చేసి మాట్లాడగా భువనగిరిలో మధుగౌడ్ కూడా ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపినట్లు పోలీసులకు తెలిపారు. జీడిమెట్ల సీఐ శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో నాయుడు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ప్రేమ విఫలం కావడంతోనే అఖిల మృతిచెందినట్టు పోలీసులు పేర్కొంటున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు.

ఆర్థిక ఇబ్బందులతో స్వర్ణకారుడు



కృష్ణమోహన్(ఫైల్)

నల్లగొండ పట్టణంలోని శివాజీనగర్ ప్రాంతానికి చెందిన నవ్వులూరి కృష్ణమోహన్(41) వృత్తిరీత్యా స్వర్ణకారుడు. ఇటీవల శివాజీ నగర్‌లో ఇంటిని నిర్మించడంతోపాటు అందులోనే బంగారం దుకాణం ఏర్పాటు చేసుకుని జీవినం కొనసాగిస్తున్నాడు. ఇంటి నిర్మాణంతో పాటు షాపు ఏర్పాటుకు అప్పులు కావడంతో కొన్ని రోజులుగా ఇబ్బందులకు గురవుతున్నాడు. ఈ క్రమంలో బుధవారం రాత్రి భార్య పిల్లలు నిద్రపోయాక ఇంట్లో హాల్లోకి వచ్చి టవల్‌తో కిటికీకి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కృష్ణమోహన్‌కు భార్య ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నాగరాజు తెలిపారు.

కుటుంబసభ్యులు మందలించారని..



ఉపేందర్(ఫైల్)

అడవిదేవులపల్లి మండల కేంద్రానికి చెందిన ఏకుల ఉపేందర్(24) ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. ప్రతిరోజూ మద్యం మత్తులో ఇంటికి వస్తుండడంతో కుటుంబసభ్యులు మందలించారు. దీంతో మనస్తాపానికి గురైన ఉపేందర్ బుధవారం రాత్రి 10గంటల సమయంలో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం మిర్యాలగూడలోని ఏరియా ఆసుపత్రికి తరలించగా చికిత్సపొందుతూ మృతిచెందాడు. ఉపేందర్ తల్లి లింగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ హరిబాబు తెలిపారు.

కార్పొరేట్ శక్తులకు కేంద్ర ప్రభుత్వం వత్తాసు : తుమ్మల వీరారెడ్డి

నార్కట్‌పల్లి, జనవరి25: ప్రధాని మోదీ నేతృత్వంలోని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు రెడ్ కార్పెట్ పరుస్తూ కార్మిక హక్కులను కాలరాస్తోందని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు తుమ్మల వీరారెడ్డి విమర్శించారు. కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఫిబ్రవరి 16న నిర్వహించనున్న దేశవ్యాప్త కార్మికుల సమ్మెను విజయవంతం చేయాలని అన్ని ట్రేడ్ యూనియన్లకు పిలుపునిచ్చారు. నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలకేంద్రంలో గురువారం జరిగిన సీపీఎం మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. మతతత్వ విధానాలను అవలంభిస్తూ రాజకీయ క్రీడ ఆడుతున్న బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దింపాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. రాష్ట్రంలో పేద బడుగు బలహీన వర్గాలకు సంక్షేమ పథకాలు అందించడంలో ప్రభుత్వానికి నిర్మాణాత్మక పార్టీగా సహకరిస్తామన్నారు. సమావేశంలో సీపీఎం నాయకులు ఎస్ఆర్ వెంకటేశ్వర్లు, చెరుకు పెద్దులు, సభ్యులు చింతపల్లి బయ్యన్న, నన్నె సాహెబ్, వెంకట్‌రాంరెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా నిత్య కల్యాణోత్సవం



నిత్యకలాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, జనవరి 25: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి పుణ్యక్షేత్రంలో స్వామి, అమ్మవార్ల తిరుకల్యాణోత్సవం ఆగమ శాస్త్రరీతిలో గురువారం వైభవంగా కొనసాగింది. కొండపైన ప్రధానాలయ అష్టభుజి ప్రాకార దక్షిణ దిశ లోని కల్యాణ మండపంలో ఉత్సవమూర్తులను పట్టువస్త్రాలు, బంగారు, ముత్యాల ఆభరణాలతో దివ్యమనోహరంగా అలంకరించిన ఆచార్యులు గజవాహన సేవలో తీర్చిదిద్ది సేవోత్సవం నిర్వహించారు. విశ్వక్సేనుడికి తొలి పూజలతో కల్యాణ తంతు జరిపిన పూజారులు సేవోత్సవంలో పాల్గొన్న భక్తులకు స్వామివారి ఆశీస్సులు అందజేశారు. ముందుగా ప్రభాతవేళ సుప్రభాతంతో స్వామిని మేల్కొలిపి నిజాభిషేకం, నిత్యార్చనలు, సుదర్శన నారసింహ హోమ పూజలు నిర్వహించారు. శివాలయంలో రామలింగేశ్వరుడికి, స్పటిక మూర్తులకు నిత్య పూజలు శైవామ పద్ధతిలో నిర్వహించారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.16,84,008 ఆదాయం సమకూరినట్టు దేవస్థాన అధికారులు తెలిపారు.

మహాద్భుతమైనది నారసింహావతారం

శ్రీమన్నారాయణుడి దశావతారాల్లో నాలుగోదైన నారసింహావతారం మహాద్భుతమైనదని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పశ్చిమగోదావరి జిల్లా భీమవరం పట్టణానికి చెందిన భీమవరం రామచంద్ర జీయర్‌స్వామి ప్రవచించారు. జీయర్‌స్వామి తన శిష్యబృందంతో కలిసి యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దివ్యక్షేత్రాన్ని గురువారం సందర్శించారు. క్షేత్ర సందర్శనకు విచ్చేసిన స్వామీజీకి అర్చకబృందం, వేదపండితులు ఆలయ మర్యాదలతో పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. జీయర్‌స్వామి గర్భాలయంలోని స్వయంభువులను దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ప్రధానాలయ ముఖమండపంలో జీయర్ స్వామీజీ పండిత గోష్ఠి నిర్వహించి భక్తులకు అనుగ్రహభాషణం అందజేశారు. ఆర్తత్రా పరాయణుడిగా నారసింహుడు ప్రసిద్ధి అని, భక్తుడి కోరికను నెరవేర్చేందుకు విశ్వమంతా వ్యాపించాడన్నారు. దశావతారాల్లో రామావతారంలో తానే స్వయంగా పితృ ఆజ్ఞను పాలించాడని, నారసింహావతారంలో పరమ భక్తాగ్రేరుడైన ప్రహ్లాదుడి భక్తిని తండ్రైన హిరణ్యకశ్యపుడు పరీక్షించగా నిర్జీవమైన స్తంభం నుంచి ఉద్భవించి భక్త తత్పరతను చాటాడని తెలిపారు.


అటవీ జంతువులను వేటాడితే చర్యలు

దేవరకొండ, జనవరి 25: అటవీ జంతువులను వేటాడితే కఠిన చర్యలు తీసుకుంటామని నల్లగొండ జిల్లా కంభాలపల్లి ఫారెస్ట్ రేంజ్ అధికారి సాయిప్రకాష్ హెచ్చరించారు. దేవరకొండలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నల్లమల్లలో మనుషులు సంచరించేందుకు అనుమతిలేదన్నారు. అటవీ జంతువులను వేటాడినా, వాటి కోసం విద్యుత్ తీగలు అమర్చడం, ఉచ్చులు పెట్టడం, విషప్రయోగం చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. అటవీ జంతువులను వేటాడి చంపితే వన్యప్రాణి సంరక్షణ చట్టం 1972లోని సెక్షన్ 2(16), 30(ఎ) ప్రకారం కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఏడు సంవత్సరాల జైలుశిక్ష విధిస్తారన్నారు. నలమల్లలో ఇటీవల వన్యప్రాణుల సంఖ్య గణనీయంగా పెరిగిందని ఆయన తెలిపారు.

చూడచక్కని కోదండరాముడి విగ్రహం

● ఏకండి చెక్కతో తయారు చేసిన గుండ్రాంపల్లి యువకుడు





చిట్యాలరూరల్, జనవరి 25: కోదండరాముడికి చూడ చక్కని విగ్రహం చెక్కాడు నల్లగొండ జిల్లా చిట్యాల మండలంలోని గుండ్రాపల్లి గ్రామానికి చెందిన యువకుడు మండలోజు వినయ్. అయోధ్యలో బలరాముడి విగ్రహ ప్రతిష్ఠన సందర్భంగా తాను కూడా శ్రీరాముడి విగ్రహాన్ని తయారు చేయాలని సంకల్పించాడు. ఏపూర్‌లోని ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేసే విజయ్ వడ్రంగి వృత్తిని మరచిపోకుండా ఏకండి చెక్కతో 10రోజులు శ్రమించి రోజుకు కొంత భాగం చెక్కుతూ విగ్రహం తయారు చేశాడు. అయోధ్యలో బలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ జరిగే సమయంలో తాను తయారు చేసిన విగ్రహానికి స్థానిక రామాలయంలో ఉంచి పూజలో పాల్గొన్నాడు. రెండు నెలల క్రితం వేంకటేశ్వరస్వామి విగ్రహాన్ని కూడా తయారు చేశానని వినయ్ తెలిపాడు.

తమలపాకులు, జిల్లేడు ఆకులతో ఆంజనేయుని గద



అయోధ్యలో రామాలయం ప్రారంభం సందర్భంగా యాదాద్రిభువనగిరి జిల్లా మోత్కూరు మునిసిపాలిటీ పరిధిలోని కొండాపురం ఆంజనేయ స్వామి ఆలయంలో పూజారి పారునంది లక్ష్మణమూర్తి తమలపాకులు, తెల్ల జిల్లేడు ఆకులతో ఆంజనేయస్వామి గద తయారు చేశాడు. ఆకులపై అయోధ్య రామాలయం నుంచి వచ్చి అక్షింతలతో 'శ్రీరాం' అని రాశాడు.

● మోత్కూరు.

పుట్టల నుంచి పాఠశాలల్లోకి...

ప్రభుత్వ పాఠశాలల గదులు, ఆవరణలో పాముల కలకలం



దేవరకొండ: దేవరకొండ డివిజన్‌లోని ప్రభుత్వ పాఠశాలల తరగతి గదులు, ఆవరణల్లో పాములు సంచరిస్తుండటంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఈ నెల 23వ తేదీన నాంపల్లి మండలం తిరుమలగిరి ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న పల్లేటి హస్సిక మధ్యాహ్నం పాఠశాల వెనుక భాగంలోకి వెళ్లగా పాము కాటేసింది. దీంతో ఉపాధ్యాయులు, స్థానికులు హుటాహుటిన బాలికను చికిత్స నిమిత్తం నాంపల్లికి తరలించి ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆ బాలిక ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. ఈ నెల 22వ చందంపేట మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో తరగతి గదుల్లో నాగు పాము కలకలం రేపింది. 5వ తరగతి చదువుతున్న గీత అనే విద్యార్థిని పుస్తకాల బ్యాగులో దాగి ఉన్న నాగుపాము బాలిక పుస్తకాలు తీస్తుండగా ఒకేసారి బయటకు వచ్చింది. దీంతో గమనించిన విద్యార్థులు, ఉపాధ్యాయులు కేకలు వేశారు. దీంతో స్థానికులు అక్కడికి చేరుకొని పామును చంపేశారు. దేవరకొండ మండలంకొమ్మెపల్లి తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల బాలుర పాఠశాలలో 5 నుంచి ఇంటర్ వరకు 534 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. గ్రామ శివారులో పాఠశాల ఉండడం, ప్రహరీ లేకపోవడంతో క్రిమికీటకాలు పాఠశాలలోకి వస్తున్నాయని విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. మైదాన ప్రాంతంలో పాఠశాల ఉన్నందున ప్రహరీ నిర్మించి రక్షణ కల్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. పాఠశాలల చుట్టూ ప్రహరిగోడలు ఏర్పాటు చేసి రక్షణ చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు స్థానికులు కోరుతున్నారు. ఈ విషయమై చందంపేట ప్రాథమిక పాఠశాల హెడ్‌మాస్టర్ జగన్‌ను వివరణ కోరగా బాలిక ఇల్లు ఊరు చివర ఉండటంతో ఆమె బ్యాగులో పాము ఉందని అన్నారు. పాఠశాలలో పారిశుధ్యం మెరుగ్గా ఉంటుందని అన్నారు.

మూణ్నాళ్ల ముచ్చటగా సోలార్ పవర్...

● **వసతి గృహాల్లో నిరర్థకంగా సోలార్ సిస్టం**



నార్కట్‌పల్లి: బహుళ ప్రయోజనాలను ఆశించి వసతి గృహాల్లో ఏర్పాటు చేసిన సోలార్ పవర్ సిస్టం మూణ్నాళ్ల ముచ్చటగా మారింది. హాస్టళ్ల నిర్వహణలో ఆర్థిక భారాన్ని తగ్గించడం, విద్యార్థులు చదువుకోవడానికి 24 గంటల పాటు విద్యుత్ సౌకర్యాన్ని కల్పించే ఉద్దేశంతో అమర్చిన సోలార్ విద్యుత్ వ్యవస్థ ఆరంభ శూరత్వమైంది. సాంకేతిక సమస్యలతో చెడిపోయిన పరికరాలకు సకాలంలో మరమ్మతులు చేయకపోవడం నిర్వహణ లోపాల కారణంగా సోలార్ పవర్ సిస్టంను నిర్వీర్యం చేశాయి. పర్యవేక్షణ లోపంతో ప్రస్తుతం అవి ధ్వంసమయ్యే దశకు చేరుకున్నాయి. జిల్లాలోని సొంత భవనాలు కలిగి ఉన్న 17 ప్రీ మెట్రిక్ హాస్టళ్లలో ప్రభుత్వ నిధులతోనే ఈ సోలార్ పవర్ సిస్టంను ఏర్పాటు చేశారు. వసతి గృహాల్లో విద్యుత్ బిల్లులను తగ్గించేందుకు లక్ష్యంతో హాస్టళ్లలో సోలార్ పవర్ సిస్టంను ఏర్పాటు చేశారు. వసతిగృహాల్లో విద్యార్థుల సంఖ్య భవన సముదాయ విస్తీర్ణాన్ని బట్టి సోలార్ ప్యానెళ్లను ఏర్పాటు చేశారు. సుమారు రూ.3 నుంచి రూ.5లక్షల వ్యయంతో ప్యానెళ్లు ఏర్పాటు చేశారు. సోలార్ పవర్ సిస్టం సాంకేతిక నిర్వహణను ఆయా ఏజెన్సీల తోనే చేయించాల్సి ఉంది. మొదట బాగానే చూసుకున్నా రు. ఆర్థిక భారం నేపథ్యంలో సోలార్ పవర్ నిర్వహణ గాలికొదిలేశారు. దీంతో సోలార్ పవర్ ప్యానల్ బోర్డులు కోతులు, ఆకతాయిల చేష్టలతో దెబ్బతిని పనికిరాకుండా పోయాయి. బ్యాటరీలు కూడా వినియోగంలో లేకపోవడంతో చెడిపోయే స్థితికి చేరుకున్నాయి. కొన్ని చోట్ల వార్డెన్లు తమ సొంత ఖర్చుతో చిన్న మరమ్మతులు చేయించి కొద్ది రోజులు వినియోగంలోకి తీసుకువచ్చారు. ఇవి పూర్తిగా పనికిరాకుండా పోయే దశకు చేరుకోకముందే ప్రభుత్వం దృష్టి సారించి వాడకంలోకి తేవాలి.

ఉన్నతాధికారులకు తెలియజేశాం : కృష్ణవేణి, ఏఎస్‌డబ్ల్యూవో

హాస్టళ్లలో ఏర్పాటు చేసిన సోలార్ సిస్టం నిరుపయోగంగానే ఉంది. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

'చింతపల్లి' స్టేషన్‌లో సిబ్బంది కొరత

● **35 మందికి 10 మంది విధుల నిర్వహణ**



చింతపల్లి: హైదరాబాద్ - నాగార్జునసాగర్ రాష్ట్ర రహదారిపై మండల కేంద్రంలో ఉన్న చింతపల్లి పోలీస్‌స్టేషన్‌కు సిబ్బంది కొరత పట్టి పీడిస్తుంది. ఎస్ఐతో పాటు ఇద్దరు ఏఎస్ఐలు కలిపి మొత్తం 35మంది సిబ్బంది ఉండాల్సి ఉండగా ప్రస్తుతం 10మంది మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. ఇందులో నలుగురు హెడ్‌కానిస్టేబుళ్లు, ఆరుగురు కానిస్టేబుళ్లు మాత్రమే మిగిలారు. గతేడాది 9వ తేదీన స్టేషన్‌లో జరిగిన ఘటనలో జిల్లా ఉన్నతాధికారులు ఎస్ఐ సతీష్‌రెడ్డిని సస్పెండ్ చేశారు. అప్పటి నుంచి చింతపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ పోస్టు ఖాళీగానే ఉంది. మూడేళ్లుగా ఇద్దరు ఏఎస్ఐ పోస్టులను భర్తీ చేయకపోగా ఆరు నెలల క్రితమే ఒక ఏఎస్ఐ బదిలీపై చింతపల్లి పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు. ఇంకా ఉన్న సిబ్బందిలో ఏడుగురు కానిస్టేబుళ్లు ప్రమోషన్లతో వివిధ ప్రాంతాలకు బదిలీపై వెళ్లారు. మరికొంత మంది సిబ్బంది డిప్యూటేషన్‌లో వివిధ ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్నారు. 50వేల పైచిలుకు జనాభా కలిగిన చింతపల్లి మండలంలో 34 గ్రామపంచాయతీలు ఉన్నాయి. ఇంతపెద్ద మండలంలో తరచుగా గొడవలు, ఘర్షణలు చోటు చేసుకుంటున్నాయి. అంతేకాక రహదారిపై నిరంతరం ప్రమాదాలు నిత్యకృత్యంగా మారాయి. పోలీసుల నియంత్రణ లేకపోవడంతో ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. మండలంలోని అనాజీపురం, కుర్మేడు, ఘడియాగౌరారం, ఇతర వాగుల నుంచి రాత్రివేళల్లో జోరుగా హైదరాబాద్‌కు ఇసుక అక్రమ రవాణా జరుగుతుంటుంది. వీటీనగర్, చింతపల్లి మండల కేంద్రాల్లో గంజాయి, గుట్కా వ్యాపారాలు పోలీసులు లేకపోవడంతో విచ్చలవిడిగా సాగుతున్నాయి. ఇన్‌చార్జి ఎస్ఐని కూడా నియమించలేదు. సిబ్బంది కొరత విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేశామని దేవరకొండ డీఎస్పీ గిరిబాబు తెలిపారు. వెంటనే సమస్యను పరిష్కరించాలన ప్రజలు కోరుతున్నారు.

సర్పంచుల పదవీకాలాన్ని పొడిగించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డేవిడ్

నిడమనూరు, జనవరి 25: సర్పంచుల పదవీకాలాన్ని పొడిగించాలని మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు పోలే డేవిడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలకేంద్రంలో గురువారం ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తాము గెలిచిన కొత్తలోనే కొవిడ్ అనేక ఇబ్బందులకు గురి చేసిందని అన్నారు. కరోనా మహమ్మారి కారణంగా మూడేళ్ల పాటు గ్రామాల్లో అభివృద్ధి పనులు స్తంభించిపోయాయని అన్నారు. అభివృద్ధి పనుల కోసం అప్పులు కూడా చేయాల్సి వచ్చిందని, ప్రభుత్వం నుంచి ఇంకా బిల్లులు రావాల్సి ఉందన్నారు. పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించేవరకు తమనే పర్సన్ ఇన్‌చార్జిలుగా కొనసాగించాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో ఆయా గ్రామాలు సర్పంచులు అంకతి నర్మదవెంకటరమణ, కొండా కృష్ణవేణిశ్రీనివాస్‌రెడ్డి, ముంగి జ్యోతి, నర్సింగు విజయ్‌కుమార్‌గౌడ్, అర్వ స్వాతి, సంకూరి అండాలు, రమేష్, బ్రహ్మన్న, రాంబాబు, రవి పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటు శక్తివంతమైన సాధనం

దేవరకొండ, మర్రిగూడ, అడవిదేవులపల్లి, చింతపల్లి, మిర్యాలగూడటౌన్, నిడమనూరు, కొండమల్లేపల్లి, హాలియా, చండూరు, కట్టంగూరు, జనవరి 25: ఓటు అనేది శక్తివంతమైన సాధనమని దేవరకొండ, మిర్యాలగూడ, చండూరు ఆర్డీవోలు శ్రీరాములు, చెన్నయ్య, దామోదర్‌రావు అన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా గురువారం జిల్లాలో పలుచోట్ల విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమాల్లో వారు మాట్లాడారు. దేశ భవిష్యత్తు యువతపై ఆధారపడి ఉందని, ప్రతి ఒక్కరూ ఓటును సద్వినియోగం చేసుకోవాలన్నారు. పాలనా ప్రక్రియలో ప్రజలను భాగస్వామ్యులను చేసేందుకు రాజ్యాంగం కల్పించిన హక్కే ఓటన్నారు. 18ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చే సుకోవాలని కోరారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఓటు శాతం పెరగకపోవడం ఆందోళన కలిగించే విషయమన్నారు. విద్యాసంస్థల యాజమాన్యాలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఓటు నమోదుపై అవగాహన కల్పించాలన్నారు. అనంతరం విద్యార్థులు, యువకులతో ప్రతిజ్ఞ చేయించారు. యువత ఓటు హక్కు కోసం నమోదు చేసుకోవాలని సూచించారు.

● దేవరకొండలో ఆర్డీవో కార్యాలయం నుంచి బస్టాండ్ అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించి ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆర్డీవో శ్రీరాములు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఓటుపై అవగాహన కలిగి ఉండేందుకు ఓటును నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సంతోష్‌కిరణ్, ఎంఈవో మాతృనాయక్, మునిసిపల్ కమిషనర్ వెంకటయ్య, ఎస్ఐ సతీష్, స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్పీటీ, డీటీలు, విద్యార్థులు పాల్గొన్నారు.



దేవరకొండ: ర్యాలీలో మాట్లాడుతున్న ఆర్డీవో శ్రీరాములు

● మర్రిగూడలో మర్రిగూడ సెంటర్‌లో విద్యార్థులు మానవహారం నిర్వహించి ఎంపీడీవో వెంకటేశ్వర్‌రావు, తహసీల్దార్ బక్క శ్రీనివాస్ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డీటీ తారకరామన్, ఆర్ఐ బషీర్, సర్పంచ్ నల్ల యాదయ్యగౌడ్, సక్కుబాయి, బాలయ్య, రజాక్ పాల్గొన్నారు.

● అడవిదేవులపల్లిలో తహసీల్దార్ సురేష్‌కుమార్, జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం అబ్బాస్‌అలీ, సిబ్బంది వాసుదేవరెడ్డి, రాంబాబు పాల్గొన్నారు.

● చింతపల్లిలో తహసీల్దార్ ఎండీ.శంషుద్దీన్ ఓటు హక్కు నమోదుపై ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో డీటీ అర్షద్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

● మిర్యాలగూడ పట్టణంలో ఆర్డీవో చెన్నయ్య విద్యార్థులు, యువకులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో తహసీల్దార్ హరిబాబు, ఎంఈవో బాలాజీనాయక్, ధన్‌రాజ్, కల్పన, జానీషరీఫ్, వ్యాసరచన పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు కేఎస్‌ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బిక్షమయ్య బహుమతులు అందజేశారు.

● నిడమనూరు మండల కేంద్రంలో అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ జంగాల కృష్ణయ్య, ఎంపీడీవో ప్రమోద్‌కుమార్, ఏఎస్ఐ జోజి, డీటీ రషీద్, రాజిరెడ్డి, ఆర్ఐలు సునిత, శశికుమార్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

● కొండమల్లేపల్లిలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమం లో ఓటరు ప్రతిజ్ఞ నిర్వహించారు. కార్యక్రమంలో ఈవో వీరబాబు, ఉపాధ్యాయులు లోక్యానాయక్, యాదగిరిరెడ్డి, చంద్రయ్య, ఎబినైజర్ పాల్గొన్నారు.

● హాలియా డిగ్రీ కళాశాలలో కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వంటెపాక యాదయ్య విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ సీహెచ్ రాజు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● చండూరులో ఆర్డీవో దామోదర్‌రావు ఓటు హక్కు వినియోగంపై ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రవీందర్‌రెడ్డి, డీటీ వరప్రసాద్, ఎన్నికల డీటీ దీపక్, ఎంపీవో స్వరూపరాణి, ప్రవీణ్ పాల్గొన్నారు.

● కట్టంగూరు తహసీల్దార్ కార్యాలయంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. దీంతో పాటు కొత్త ఓటర్లకు ఓటరు కార్డులను అందజేశారు. పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ స్వప్న, ఎంపీడీవో సునీత, ఆర్ఐ కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.



చండూరులో ర్యాలీలో పాల్గొన్న ఆర్డీవో దామోదర్‌రావు



కొండమల్లేపల్లిలో ప్రతిజ్ఞ చేస్తున్న చిన్నారులు



మిర్యాలగూడలో మాట్లాడుతున్న ఆర్డీవో చెన్నయ్య



అడవిదేవులపల్లిలో ప్రతిజ్ఞ చేస్తున్న ఓటర్లు



ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవచేయాలి

● *నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం*

చిట్యాలరూరల్, జనవరి 25: ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ వారికి సేవ చేయాలని, అలాంటి వారికి ప్రజలే పట్టాభిషేకం చేస్తారని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. చిట్యాల మండలం పేరేపల్లి, బొంగోనిచెర్వు గ్రామాల్లో డ్రైనేజీ నిర్మాణ పనులు, సీసీరోడ్డు పనులు, బొంగోనిచెర్వు గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులకు గురువారం ఎమ్మెల్యే వీరేశం శంకుస్థాపనలు చేశారు. వెలిమినేడు పీఏసీఎస్ చైర్మన్‌గా ఎన్నికైన ఏనుగు రఘుమారెడ్డి ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. చైర్మన్‌గా ఎన్నికైన రఘుమారెడ్డిని జిల్లా సహకార శాఖ అధికారి కిరణ్‌కుమార్ ప్రమాణస్వీకారం చేయించారు. రఘుమారెడ్డిని ఎమ్మెల్యే శాలువా కప్పి సన్మానం చేసి అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీరేశం మాట్లాడుతూ అన్నదాతలుగా కొలిచే రైతులకు సేవలందించే అవకాశం రావడం అదృష్టమని అన్నారు. సంఘం ద్వారా రైతులకు కలిగే ప్రయోజనాలను వారికి అందించేందుకు చైర్మన్‌తో పాటు పాలకవర్గ సభ్యులంతా సమన్వయంతో కలిసి కృషి చేయాలన్నారు. సంఘం అభ్యున్నతికి తన వంతుగా కృషి చేస్తానని, గ్రామంలోని సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తూ అభివృద్ధి కార్యక్రమాలను తప్పనిసరిగా చేపడతామన్నారు. రైతులు, ప్రజలు రాష్ట్రంలో మార్పును కోరుకుని కాంగ్రెస్ పార్టీపై నమ్మకంతో అభ్యర్థులందరినీ అత్యధిక మెజార్టీతో గెలిపించారని అన్నారు. తనను భారీ మెజార్టీతో గెలిపించిన ప్రజల రుణం తీర్చుకుంటానని హామీ ఇచ్చారు. ప్రజల నమ్మకాన్ని వమ్ముచేయకుండా సంక్షేమ పథకాలను అమలు చేస్తూ వారు ఆశించినంత అభివృద్ధిని చేపడతామన్నారు. అర్హులైన వారందరికీ ప్రభుత్వ పథకాలను అందించి తీరుతామని, త్వరలో మరికొన్ని పథకాలను ప్రభుత్వం అందించనుందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాప్రభుత్వమని పరిపాలనలో మార్పుని చూపుతుందని ఆయన పేర్కొన్నారు. నకిరేకల్‌ను అభివృద్ధి పథంలో అగ్రగామిగా నిలిపి ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని అన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌దే విజయం : రవీంద్ర

దేవరకొండ, జనవరి 25: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు బీఆర్‌ఎస్ అభ్యర్థుల విజయం ఖాయమని మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. గురువారం దేవరకొండలో పీఏపల్లి మండలం ఘట్టునెమలిపూర్ గ్రామ బీఆర్‌ఎస్ కార్యకర్త చిన్నబోయిన బిక్షమయ్య మృతి చెందడంతో బీఆర్‌ఎస్ ప్రమాద బీమా పథకం ద్వారా మంజూరైన రూ.2లక్షలను మృతుని భార్య మంగమ్మకు అందజేసి మాట్లాడారు. పార్టీ కోసం పనిచేసే వారికి బీఆర్‌ఎస్ అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు వల్లపురెడ్డి, పరమేష్, వేముల రాజు, కృష్ణ, అంజనేయులు, కిష్టు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్లు సమయపాలన పాటించాలి

డిండి, చింతపల్లి, జనవరి 25: గ్రామాల్లో రేషన్‌డీలర్లు సమయపాలన పాటించాలని డిండి, చింతపల్లి తహసీల్దార్లు తిరుపతయ్య, ఎండీ.శంషుద్దీన్ అన్నారు. తహసీల్దార్ కార్యాలయాల్లో గురువారం డీలర్లతో నిర్వహించిన సమావేశాల్లో వారు మాట్లాడారు. డీలర్లు ఫిబ్రవరి 15వ తేదీలోగా ఈకేవైసీ పూర్తి చేయాలని సూచించారు. ప్రతీ నెలా 23వ తేదీలోపు వినియోగదారులకు బియ్యం పంపిణీ చేయాలని కోరారు. బినామీ డీలర్లపై కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు. ఆయా సమావేశాల్లో డిప్యూటీ తహసీల్దార్ ఎండీ.అర్షద్, ఆర్ఐ యాదయ్య, రేషన్‌డీలర్లు తదితరులు పాల్గొన్నారు.



చింతపల్లిలో మాట్లాడుతున్న తహసీల్దార్ శంషుద్దీన్

సంక్షిప్త సమాచారం...

కార్మిక సమ్మెను జయప్రదం చేయాలి

దామరచర్ల: కేంద్రం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్ చట్టాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ ఫిబ్రవరి 16న చేపట్టే సమ్మెను కార్మికులు జయప్రదం చేయాలని సీఐటీయూ మండల కన్వీనర్ భైరం దయానంద్ అన్నారు. గురువారం మండలకేంద్రంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను అనుసరిస్తుందని ఆరోపించారు. వెంటనే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని లేకుంటే ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో అప్పారావు, చిన్న, అరవింద్, దాసు, రంజాన్ తదితరులు పాల్గొన్నారు.

టీఎస్ యూటీఎఫ్ మండల అధ్యక్షుడిగా శ్రీరాములు

కొండమల్లేపల్లి: కొండమల్లేపల్లి టీఎస్‌యూటీఎఫ్ మండల అధ్యక్షుడిగా గనిమళ్ల శ్రీరాములు ఎన్నికయ్యారు. మండల కేంద్రంలో గురువారం జరిగిన సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు ఎడ్ల సైదులు సమక్షంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా గనిమళ్ల శ్రీరాములు, ప్రధాన కార్యదర్శి చేపూరి సజీవకుమార్, ఉపాధ్యక్షురాలు మాదాసు విజయప్రిస్కిల్లా, కోశాధికారి బొడ్డుపల్లి వెంకట్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు సైదులు మాట్లాడుతూ సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి ఓపీఎస్‌ను అమలుచేయాలని అన్నారు. ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల నోడ్ అధికారి చేరుపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బీసీలను చిన్న చూపు చూస్తున్న సీఎం

మిర్యాలగూడ టౌన్: సీఎం రేవంత్‌రెడ్డి బీసీలను చిన్న చూపు చూస్తున్నారని బీసీ సంక్షేమ సంఘ రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ అన్నారు. అసెంబ్లీ టికెట్ల కేటాయింపులో బీసీలకు రేవంత్ అన్యాయం చేశారని అన్నారు. సీఎం కార్యాలయంలో బీసీ ఉన్నతాధికారులకు సముచిత స్థానం ఇవ్వలేదన్నారు. ప్రభుత్వ సలహాదారులు, ఇతర ఉన్నత పదవుల్లో బీసీలకు తగిన ప్రాధాన్యతనివ్వక పోవడం సరికాదన్నారు. సామాజిక న్యాయం అమలు చేయకపోతే ఏ ప్రభుత్వమైనా తగిన మూల్యం చెల్లించక తప్పదన్నారు.

అంగడిస్థలంలో అక్రమ నిర్మాణాలు తొలగించాలి

నార్కట్‌పల్లి: నార్కట్‌పల్లిలోని కూరగాయల సంత నిర్వహించే అంగడి స్థలంలో అక్రమ నిర్మాణాలను తొలగించాలని నార్కట్‌పల్లి పరిరక్షణ సమితి (ఎన్‌పీఏస్) సభ్యుల బృందం పంచాయతీ కార్యదర్శి సుబాన్‌కు వినతిపత్రం అందజేసింది. అంగడి స్థలంలో అక్రమంగా నిర్మించిన మాంసాహార విక్రయ దుకాణాలు ఇతర అక్రమ నిర్మాణాలు తొలగించాలని అన్నారు. గతేడాది జూన్ 20 తేదీన పంచాయతీ పాలకవర్గ సమావేశంలో తీర్మానించిన విషయాన్ని వినతిపత్రంలో పేర్కొన్నారు. వినతిపత్రం సమర్పించిన వారిలో వార్డు సభ్యులు మేడబోయిన శ్రీనివాస్, కన్నెబోయిన నర్సింహ, అంజిరెడ్డి, శ్రవణ్‌కుమార్, రామలింగం పాల్గొన్నారు.

ఐసీడీఎస్‌కు కుర్చీల బహూకరణ

మునుగోడు: మునుగోడు మండలం కొంపల్లి గామానికి చెందిన వెదిరె మేఘారెడ్డి తన తల్లి వెదిరె పూలమ్మ జ్ఞాపకార్థం 150 కుర్చీలను మహిళా, శిశు సంక్షేమ అభివృద్ధి సంస్థ (ఐసీడీఎస్) ప్రాజెక్ట్ కార్యాలయానికి గురువారం అందజేశారు. ఐసీడీఎస్ పరిధిలోని గ్రామాల అంగన్‌వాడీ కేంద్రాల టీచర్లతో ప్రతి నెలా వివిధ స్థాయిల్లో జరిగే సమీక్షా సమావేశాలకు హాజరైనప్పుడు కుర్చీలు లేక నేలపై కూర్చొని పడుతున్న ఇబ్బందులను తెలుసుకున్న మేఘారెడ్డి స్వచ్ఛందంగా కుర్చీలు అందజేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నరేందర్, డీటీ నరేష్, ఐసీడీఎస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సమావేశాన్ని విజయవంతం చేయాలి

తిరుమలగిరి(సాగర్): శాలిగౌరారంలో ఈనెల 28వ తేదీన నిర్వహించే టీఎస్ యూటీఎఫ్ జిల్లా విస్తృతస్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలని మండల నోడల్ అధికారి కె.శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలోని జడ్పీ హైస్కూల్‌లో సంఘం సమావేశ పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని, పెండింగ్‌లో ఉన్న డీఏలను ప్రభుత్వం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాజు, సైదులు, వినయ్‌కుమార్, జానిపాషా, రవీందర్‌బాబు, హాము, నరేందర్, చంద్రకళ పాల్గొన్నారు.

వేములపల్లి: త్వరలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయానికి కార్యకర్తలు కృషి చేయాలని కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ పుట్టల కృపయ్య అన్నారు. హైదరాబాద్‌లోని ఎల్‌బీనగర్‌లో నిర్వహించే బూత్ లెవల్ కార్యకర్తల సమావేశానికి వెళ్తున్న బస్సుకు ఆయన జెండా ఊపి ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచులు రేగట్టి రవీందర్‌రెడ్డి, మర్రి ఎలియాస్, సత్యం, నాయకులు వెంకన్న, చంటి, గిరి, కరుణాకర్, జానకిరాములు, జాన్‌రెడ్డి, కృష్ణ పాల్గొన్నారు.

మిర్యాలగూడ టౌన్: ప్రభుత్వ కళాశాల మైదానంలో గణతంత్ర వేడుకలు నిర్వహించనున్నట్లు ఎంఈవో బాలాజీనాయక్ తెలిపారు. వేడుకలకు ఎమ్మెల్యే బీఎల్‌ఆర్, ఆర్డీవో చెన్నయ్య, డీఎస్పీ వెంకటగిరి హాజరుకానున్నట్లు తెలిపారు. ఉన్నత పాఠశాలలు, రెసిడెన్షియల్ స్కూళ్లలో జెండా ఆవిష్కరించిన అనంతరం విద్యార్థులను మైదానానికి తీసుకురావాలని హెచ్‌ఎంలను కోరారు. కార్యక్రమ అనంతరం ఎమ్మెల్యే బీఎల్‌ఆర్ విద్యార్థులకు నోట్ బుక్స్ అందజేస్తారని తెలిపారు.

● దామరచర్ల మండలంలో అధిక ధరలకు మద్యం విక్రయిస్తున్న దుకాణదారులపై చర్యలు తీసుకోవాలని యువజన సంఘాల నాయకులు ఎక్సైజ్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. మండలంలోని పలు దుకాణాల్లో నిబంధనలకు విరుద్ధంగా అధిక ధరలకు మద్యం అమ్ముతున్నట్లు ఆరోపించారు. అధికారులు మండంలో పర్యటించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గాదగోని మహేష్, పరంగి సురేష్, కృష్ణ, రమేష్, బాలకృష్ణ, శ్రీహరి పాల్గొన్నారు.

మిర్యాలగూడ అర్బన్: ఏరియా ఆస్పత్రికి వచ్చి వెళ్లే రోగులకు కనీస వసతులు సమకూర్చాలని తెలంగాణ యువజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుంకు శ్రీనివాస్ అన్నారు. గురువారం ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాస్ సమరద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్పత్రిలో వీల్‌చైర్లు, మంచినీటి సౌకర్యం లేకపోవడంతో రోగులు తీవ్ర అసౌకర్యానికి లోనవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆస్పత్రి ప్రాంగణం గుంతలమయంగా మారడంతో వృద్ధులు నడిచే పరిస్థితి లేదన్నారు. సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషిచేస్తానని చెప్పినట్లు తెలిపారు. ఆయన వెంట సామాజిక కార్యకర్త చేగొండి మురళియాదవ్, జ్వాల వెంకటేశ్వర్లు ఉన్నారు.

మునుగోడు, మునుగోడురూరల్: మునుగోడు మండలం కోతులారం గ్రామానికి చెందిన కందుల జగదీశ్వర్‌కు ఓయూ యూనివర్సిటీ మెకానికల్ ఇంజనీరింగ్ విభాగంలో డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ పీహెచ్‌డీ పూర్తి చేసినట్లు తెలిపారు. మెకానికల్ ఇంజనీరింగ్ విభాగంలో 'ప్రయోత్మకం, సంఖ్యా విధానంపైన కావిటేటింగ్ ఫ్లో, పాస్ట్ యాక్సిసిమెట్రిక్ బాడీస్' అనే అంశంపై ప్రొఫెసర్లు ఉషశ్రీ, రవీందర్ రెడ్డి పర్యవేక్షణలో అధ్యయనం చేశారు. ఆయన్ను పలువురు అభినందించారు.